క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చేవెళ్ల: చేవెళ్ల సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్ శాఖ చేవెళ్ల ఏడీ స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. చేవెళ్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మిన్‌వుల్ ఇండస్ట్రియల్ ఫీడర్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కారణంగా చేవెళ్ల మండల కేంద్రంతో పాటు ఇబ్రహీంపల్లి, దామరగిద్ద, న్యాలట, రామన్నగూడ, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

28న తైబజార్ వేలం

మొయినాబాద్: మొయినాబాద్ సంత(అంగడి) తైబజార్ వేలంపాట ఈ నెల 28న నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ కరిమాబీ షేక్ మహబూబ్, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 28న ఉదయం 11 గంటలకు మొయినాబాద్ గ్రామ పంచాయతీలో తైబజార్ వేలంపాట నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు 28న ఉదయం 10.30 గంటల లోపు రూ.10 వేలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

కనుల పండువగా స్వామివారి పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న గ్రామస్తులు

షాబాద్: మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో కొలువుదీరిన బుగ్గరామేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అగ్నిగుండం, పల్లకీ సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో శోభయాత్ర సాగింది. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసులు, సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రవీందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన బీజేపీ నేతలు



ర్యాలీని ప్రారంభిస్తున్న మిథున్‌రెడ్డి

షాద్‌నగర్‌టౌన్: 'మా నౌకరీలు మాకు కావాలి' అనే నినాదంతో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మహాధర్నా కార్యక్రమానికి షాద్‌నగర్ నుంచి భారీ ఎత్తున బీజేపీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వాహనాల ర్యాలీని బీజేపీ నేత మిథున్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. తరలివెళ్లిన వారిలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు కురుమయ్య, శ్రీనివాస్, జగదీష్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

కొందుర్గు: కొందుర్గు బాలుర ప్రాథమిక పాఠశాలలో శనివారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వరప్రసాద్ విద్యార్థుల ప్రతిభను అభినందించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ప్రధానంగా శంభో శివ శంభో, మిలటరీ విన్యాసం, కోలాటం, ఫోక్ డ్యాన్స్, అనాథ పిల్లలను ఎలా ఆదుకోవాలనే నాటిక అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ ఆదిలక్ష్మి, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, ఎంఈఓ కిష్టారెడ్డితో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో 'పోషణ్ పక్వాడ్'



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

చేవెళ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, మహిళలకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచులు, అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రజలకు అందించే పౌష్టికాహారం, చిరుధ్యానాలను ప్రదర్శించారు. పోషక లోపాలతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. పోషణ్ పక్వాడ్ కార్యక్రమాలను ప్రతి ఇంటికి తీసుకుపోవాలని చెప్పారు. ఏప్రిల్ 3వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య



సర్పంచ్‌లకు సన్మానం చేసి అవార్డు, సర్టిఫికెట్లు, అందజేసిన ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమని, ప్రజల సహకారంతో గ్రామాలు అభివృద్ధి పథంలో కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శనివారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నక్షత్రంజీవంతు, ఎంపీడీఓ సంధ్యల ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ అవార్డుల ప్రధానోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించారు. 28 గ్రామ పంచాయతీలకు గాను 16 గ్రామ పంచాయతీలకు అవార్డులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని అవార్డులు పొందిన సర్పంచ్, ఎంపీటీసీలను సన్మానించారు. సర్పంచ్‌లకు అవార్డు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులు, సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం గుర్తించి పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పేరిట వివిధ విభాగాల్లో ఉత్తమ పురస్కారాలు అందజేసిందని తెలిపారు. సన్మానం పొందిన వారు మరింత అభివృద్ధి చేయాలని, సన్మానం పొందని వారు సన్మానానికి పోటీ పడాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో ఉత్తమ పాలన, సామాజిక భద్రత మౌలిక సదుపాయాలు, ఆరోగ్యకరమైన చైల్డ్ ఫ్రెండ్లీ, పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, మహిళా స్నేహపూర్వక క్లీన్ అండ్ గ్రీన్ తదితర విభాగాల్లో ప్రజాప్రతినిధులు ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. మండలంలో మేజర్ గ్రామాలు సత్కారంలో ముందుండడం సంతోకరమని కొనియాడారు. హిమాయత్‌నగర్, చిలుకూరు, పెద్ద మంగళారం ఆయా గ్రామాలు అభివృద్ధిలో ముందు వరుసలో కొనసాగుతున్నాయని తెలియజేశారు. అభివృద్ధికి అందరి సహకారం ఎంతో అవసరమని కలిసికట్టుగా అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం , ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల తహసీల్దార్ అశోక్ కుమార్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నరోత్తమ్‌రెడ్డి, సర్పంచ్‌లు రాఘవరెడ్డి, స్వరూపాఅంద్రూ, లావణ్య , రవళి, ఆడి మాణెమ్మ, సుకన్య ,వైఎస్ ఎంపీపీ మమత, ఎంపీటీసీలు లత, ప్రభావతిగణేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

108 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడపడుచులకు పెద్దన్నగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ అభివృద్ధి కార్యాలయంలో మండల తహసీల్దార్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో 108 కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడంలో దేశంలోనే ముందున్నారని అన్నారు. ఆడపడుచులను కళ్యాణ లక్ష్మి పేరిట ఆదుకుంటున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నరోత్తమ్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

శంకరపల్లి: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండలంలోని అంతప్పగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారాముల, లక్ష్మణ అంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు నిర్వహించిన విగ్రహాల ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అలివేలు, ఉప సర్పంచ్ అవినాష్, మాజీ సర్పంచ్ బీరయ్య, మాజీ ఎంపీటీసీ దశరథ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పని చేసే కార్యకర్తలకు ప్రాధాన్యత

- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- మండలంలో కొనసాగిన ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కేశంపేట: కష్టపడుతున్న కార్యకర్తలకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆదేశాల మేరకు మండలంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి అధ్యక్షతన మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం సబ్బండవర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. పార్టీపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించిన ప్రజల అభిమానం కేసీఆర్ ప్రభుత్వం గెలుచుకుందని ఆయన అన్నారు. మళ్లీ రానున్న ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ప్రతిపక్ష పార్టీ నాయకులకు అధికారంపైన మాత్రమే మక్కువ ఉందని, ప్రజా సమస్యలు వారికి తెలియదని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మిషన్‌కాకతీయ, మిషన్ భగీరథ, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, రంజాన్ తోఫా, క్రిష్టియన్లకు క్రిస్మస్ దుస్తులు, బతుకమ్మ చీరలు, ప్రభుత్వ ఆస్పత్రిల్లో కాన్పులు జరిగి ఆడపిల్ల పుడితే 13వేలు, మగపిల్లవాడు పుడితే 12వేలతో పాటు కేసీఆర్ కిట్ అందించడం జరుగుతుందని ఆయన వివరించారు. త్వరలోనే ఇంటి నిర్మాణాలకు మూడు లక్షల రూపాయాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణాలు జరగకుండా కోర్టుల్లో కేసులు వేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ యాదవ్, స్త్రీశిశుసంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల , జడ్పీ వైస్ చైర్మన్ గణేష్, వైస్ ఎంపీపీ అనురాధ, లక్ష్మీనారాయణగౌడ్, రాంబాల్‌నాయక్, పల్లె నర్సింగ్‌రావు, విశ్వనాథం, జగదీశ్వర్‌గౌడ్, నవీన్‌కుమార్, జమాల్‌ఖాన్, వెంకట్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, శ్రీను, నారాయణరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరిక

నందిగామ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు స్వచ్ఛందగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువకులు ఆ గ్రామ సర్పంచ్ జేకే నర్సింహులు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెలే అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు. పార్టీలో చేరిన వారిలో వడ్ల నర్సింహులు, వడ్ల సుధాకర్, రాజు, నారాయణ, చెన్నయ్య, ప్రభు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గణేష్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు లత శ్రీశైలం, నాయకులు నర్సింహులు, భార్గవ లింగం, రమేష్, కృష్ణయ్య, ఎల్లయ్య,రాజు, కుమార్, రాంగోపాల్, వెంకటయ్య, చెన్నయ్య, లక్ష్మయ్య, బేగ్, నవీన్ సురేష్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొత్తూరు: రోజువారీగా తినే ఆహారంలో చిరుధాన్యాలు ఉండే విధంగా చూసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కొత్తూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి పేర్కొన్నారు. పోషన్ అభియాన్‌లో భాగంగా కొత్తూరు పట్టణంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరబాలికలకు 'చిరుధాన్యాలు –ఆరోగ్యం' అనే అంశంపై ఆమె అవగాహన కల్పించారు. బాలికలు ప్రతిరోజు ఒకేరకమైన ఆహారం కాకుండా పోషకాలు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు తీసుకోవాలన్నారు. ఎదిగే వయస్సులో పౌష్టికాహారం లోపిస్తే తరచుగా అనారోగ్యాల బారిన పడడంతో పాటు బలహీనంగా తయారవుతారని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది ఇందిరా, సుమిత్ర, అనిత అరుంద, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక పురోభివృద్ధితో ఎదుగుదల

జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న మండల మహిళా సమాఖ్య భవనంలో మహిళా సంఘాల సభ్యులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరైన జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్‌లు మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళా సంఘాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని అన్నారు. స్త్రీనిధి రుణాల ద్వారా చాలా మంది సభ్యులు జీవనోపాధి పెంపొందుతున్నారని తెలిపారు. రుణాలు పొందిన మహిళలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించి పది మందికి ఉపాధి కల్పించాలన్నారు. తద్వారా ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య చేపట్టే కార్యక్రమాలపై మాట్లాడారు. గ్రామ సంఘాల పని తీరు, ఆదాయ వ్యయాల వివరాలు, జమ చెల్లింపుల వివరాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఏపీఎం నగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా మహ్మద్‌షఫీ



అవార్డును అందుకుంటున్న మహ్మద్ షఫీ

షాద్‌నగర్: షాద్‌నగర్ డివిజన్‌లో టీబీ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న మహ్మద్ షఫీ ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రి ఆడిటోరియంలో అవగాహన సదస్సు, అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయవ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడం, శిబిరాలు నిర్వహించడం, తెమడ పరీక్షలు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తమ సేవలు అందించిన మహ్మద్‌రఫీ ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా టీబీ ఆఫీసర్ డాక్టర్ అరుణకుమారి చేతుల మీదుగా మహ్మద్ షఫీ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పనులు చేసి ఏడాదైనా బిల్లులు రావా?

- అధికారులపై సర్పంచ్‌ల ఆగ్రహం
- సర్వసభ్య సమావేశంలో సమస్యల ఏకరువు



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు

కొందుర్గు: తమ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి ఏడాది దాటింది, చివరకు తమ పదవీ కాలం ముగిసిపోతున్నా చేసిన పనులకు బిల్లులు రావా అంటూ అధికారులపై సర్పంచ్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోతురాజు జంగయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఉపాధిహామీ వివరాలను ఏపీఓ నర్సింగ్‌రావు చదువుతుండగా ఆయా గ్రామాల సర్పంచులు అసహనం వ్యక్తం చేశారు. తాము గ్రామాల్లో క్రీడామైదానం పనులను పూర్తిచేసి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు బిల్లులు రాలేదని వాపోయారు. కనీసం ఎంత బిల్లు వస్తుందో తెలియని దుస్థితి ఏర్పడిందన్నారు. తంగెళ్లపల్లి-వెంకిర్యాల గ్రామాల మధ్యన శిథిలావస్థకు చేరిన వంతెన ఈ ఏడాది వర్షాలకు కొట్టుకుపోతుందని సర్పంచ్‌లు శ్రీధర్‌రెడ్డి, లింగం గౌడ్ వాపోయారు. ఈ వంతెన ఎప్పుడు నిర్మిస్తారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ స్పందిస్తూ ఆర్అండ్‌బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ వంతెన నిర్మాణం కోసం రూ.2.31 కోట్లు మంజూరయ్యాయని, టెండర్ వేయడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ ద్వారా సేవలందిస్తామని రోగుల నుంచి రూ. 50 తీసుకుంటున్నారని, ఉచితంగా అందించే సేవలకు డబ్బులు ఎందుకు తీసుకుంటున్నారని సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. ఉమ్మెంత్యాలలో 15 రోజులుగా పైపులైన్ లీకేజీ సమస్య పరిష్కరించడం లేదని సర్పంచ్ నర్సింలు వాపోయారు. తమ తండాలో నీళ్లు రావడం లేదని అయోధ్యాపూర్ తండా సర్పంచ్ బద్దీ వాపోయారు. ఇందుకు ఎంపీడీఓ ఆంజనేయులు స్పందిస్తూ త్వరలోనే సమస్య పరిష్కరించేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జయశ్రీకి సూచించారు. కొందుర్గు బస్టాండ్ ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్‌గా మారిందని, బస్టాండ్ ఆవరణలో రూ.24 లక్షలు ఖర్చుచేసి మూత్రశాలలు నిర్మిస్తే నేటికి వినియోగంలోకి తీసుకురాకపోవడం బాధాకరమని వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ అన్నారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీఓ లాలయ్య, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్య, పీఆర్ డిప్యూటీ ఈఈ చిరంజీవులు, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, ఉద్యానవన శాఖ అధికారిణి ఉషశ్రీతో పాటు వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 186 మంది గైర్హాజరు

షాద్‌నగర్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. అయితే, శనివారం నిర్వహించిన ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు చాలా మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. షాద్‌నగర్‌లో ఏ ర్పాటు చేసిన ఏడు పరీక్షా కేంద్రాల్లో 2798 మంది విద్యార్థులకు గాను 2612 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 186 మంది విద్యార్థు లు గైర్హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 510మంది విద్యార్థుల కు 482మంది, మొగిలిగిద్ద ప్రభుత్వ కళాశాలలో 222మంది విద్యార్థులకు గాను 215 మంది, ప్రతిభ కళాశాలలో 377 మందికి 347 మంది, విశ్వ భారతీ కళాశాలలో 518మందికి 492 మంది, విజ్ఞానస్‌జూనియర్ కళాశాలలో 578మందికి గాను 532మంది, విజేత జూనియర్ కళాశాలలో 366 మందికి 338మంది, శ్రీ సాయి ఒకేషనల్ కళాశాలలో 227మందికి 206 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్ పరీక్షల కస్టోడియన్ అధికారులు తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుడు మృతి

షాబాద్: మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీరాం సత్తయ్య(73) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం నిర్వహించిన అంత్యక్రియల్లో మాజీ ఎంపీపీ వెంకటయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ పర్వేద నర్సింహులు, గ్రామ సర్పంచ్ జయమ్మ పాల్గొన్నారు.

బీఎస్పీతోనే సబ్బండవర్గాల అభివృద్ధి

బీఎస్పీ నాయకుడు శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కేశంపేట: రాష్ట్రంలో సబ్బండవర్గాలు రాజకీయ, ఆర్థికాభివృద్ధి చెందాలంటే బీఎస్పీకి రానున్న ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో శనివారం బీఎస్పీ మండల ముఖ్యనాయకుల సమావేశం మండల అధ్యక్షుడు హరి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కేసీఆర్ నియంతపాలనను అంతమొందించాలని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ఆయన కోరారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి బీఎస్పీ విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ గెలిచేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్, మల్లేష్, భీమయ్య, సుగుణ, శ్యాంకుమార్, అనంతయ్య, మల్లేష్ కృష్ణ, చందు, రియాజ్, రాఘవేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ దొందూ దొందే..

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్



ప్రజాసమస్యలను తెలుసుకుంటున్న శంకర్

కొందుర్గు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు దోచుకో దాచుకో అన్న చందంగా మారిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. హాత్‌సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని జాకారం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ దొందూ దొందేనని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి నియంతృత్వ పాలన సాగిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష పార్టీల నోరు నొక్కడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం

రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా కొందుర్గు, జిల్లేడ్ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. నియంతృత్వ బీజేపీ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరికొచ్చాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాశాఖ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజు, నాయకులు చంద్రశేఖర్, నరేందర్, రవీందర్, మల్లేష్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, సత్యనారాయణ రెడ్డి, రజిత, ఆంజనేయులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు బీజేపీ కుట్రే

చేవెళ్ల నియోజకవర్గ సమన్వయకమిటీ సభ్యుడు ఎస్.వసంతం



చేవెళ్ల: విలేకర్లతో మాట్లాడుతున్న వసంతం

చేవెళ్ల: రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం ముమ్మాటికీ బీజేపీ కుట్రేనని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యుడు ఎస్.వసంతం పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీపై తీసుకున్న చర్యను త్రీవంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్య విలువలను బీజేపీ ప్రభుత్వం తుంగలో తక్కుతుందని విమర్శించారు. దేశచరిత్రలో ఎన్నడు లేని విధంగా కక్షసాధింపు చర్యలుకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ జోడోయాత్రకు వస్తున్న ప్రజా స్పందన చూసి ఓర్వలేక బీజేపీ ఇలాంటి చర్యలకు పాల్పడిందన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు డీసీసీ నాయకులు ఆగిరెడ్డి, పెంటయ్య, మధుసూదన్‌గుప్తా ఉన్నారు.

బీజేపీతో ప్రజాస్వామ్యం ఖూనీ

మొయినాబాద్: కేంద్రం బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్ ఆరోపించారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ ఐక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణకోసం రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి అదానీ, మోదీల చీకటి స్నేహాన్ని నిలదీయడంతో పాటు పార్లమెంట్‌లో పోరాటం చేయడంతో ఆయనపై ప్రధాని మోదీ కుట్రపూరితంగా అనర్హత వేటు వేయించారన్నారు. బీజేపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేస్తుందో ప్రజలు గమనిస్తున్నారని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, రాష్ట్ర నాయకుడు గౌరి సతీష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు మహేందర్ ముదిరాజ్, జంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, రియాజ్, బాలకృష్ణారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాహుల్ అహంకారమే అనర్హతకు కారణం

బీజేపీ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: రాహుల్ గాంధీ అహంకారపూరిత వ్యాఖ్యలే ఆయన అనర్హతకు కారణమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాజ్యాంగం, చట్టాలపై కాంగ్రెస్ నేతలు అవగాహన లేకుండా బీజేపీపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు రాహుల్‌గాంధీపై అనర్హత వేటు ఎందుకు వేశారన్న విషయంపై మాట్లాడకుండా వారికి తోచిన విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. గతంలో ఇందిరాగాంధీ, ఇప్పుడు రాహుల్ గాంధీ రాజ్యాంగంపై గౌరవం లేకుండా వ్యవహరించారని తెలిపారు. ప్రజాక్షేత్రంలో ప్రధాని మోదీకి, రాహుల్‌గాంధీకి ఎంత ఆదరణ ఉందో ప్రపంచ వ్యాప్తంగా అందరికి తెలుసన్నారు. కార్యక్రమంలో అందెబాబయ్య, వంశీకృష్ణ, మురళీ, వెంకటేష్, శ్రీనివాస్‌చారి, హన్మంత్, పద్మారెడ్డి, నరేష్ పాల్గొన్నారు.